## ST. JOSEPH’S COLLEGE FOR WOMEN (AUTONOMOUS) VISAKHAPATNAM

(Reaccredited by NAAC with ‘A’ Grade)

WASTE MANAGEMENT CLUB IN COLLABORATION WITH MONTANA, US

& GREEN WAVES RECYCLERS – PRESIDENT – RENU YADAV

Eenadu 13th February 2018

# సమాజం కోసం..
# కొంత సమయం



విద్యార్థినులు సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు

ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాల నివారణ కోసం సెయింట్‌జోసఫ్ కళాశాల విద్యార్థినులు చేస్తున్న ప్రయత్నం సత్ఫలితాలనిస్తోంది. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్మూలించేందుకు వీరు తమ వంతు కృషి చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక క్లబ్ ఏర్పాటు చేసుకున్నారు.

### ఎలక్ట్రానిక్స్, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలకు యువత యత్నం

### పర్యావరణ క్లబ్‌ల ఏర్పాటు

ఈనాడు - విశాఖపట్నం

వాతావరణాన్ని కాలుష్యమయం చేస్తున్న వాటిలో ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలే కీలకంగా ఉన్నాయి. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో వినియోగించే సర్క్యూట్ బోర్డులు, ఇతర చిప్‌లలో పాదరసం, లెడ్, కాడ్మియం, నికెల్, ఆర్సెనిక్ తదితర రసాయన పదార్థాలుంటాయి. వీటితో తయారైన ఉత్పత్తులు పని చేయకపోతే చాలా మంది సాధారణ వ్యర్థాలతో కలిపి చెత్తకుండీల్లో పడేస్తుంటారు. కార్పొరేషన్ అధికారులు వాటిని డంపింగ్‌యార్డుకు తరలించి తగులబెట్టేస్తుంటారు. ఆ వేడికి అవి కరిగి విషవాయువుల్ని ఉత్పత్తి చేస్తుంటాయి. వీటిని పీల్చిన వారికి క్యాన్సర్‌లాంటి ప్రాణాంతకమైన వ్యాధులు వచ్చే అవకాశాలెక్కువ. దీన్ని దృష్టి ఉంచుకుని జ్ఞానాపురంలోని సెయింట్‌జోసఫ్ విద్యార్థినులు 'వేస్ట్ మేనేజ్‌మెంట్ క్లబ్' పేరిట ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. పర్యావరణాన్ని కాపాడాలన్న ఆలోచన ఉన్నవారందరూ ఇందులో చేరి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సాధారణ చెత్తతోపాటు చెత్త కుండీల్లో పడేస్తే ఎలాంటి పరిణామాలను ఎదుర్కోనాల్సి వస్తుందో ప్రతివారం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.
- క్విజ్‌పోటీలను నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ అంశాలపై విద్యార్థినుల మేధస్సు, పర్యావరణ స్పృహ పెంపొందేలా చేస్తున్నారు.
- పనికిరానివాటితో అందమైన వస్తువులను తయారు చేస్తున్నారు. వీటితో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. వీటిని తయారు చేయాలనుకునేవారికి శిక్షణ ఇస్తున్నారు.
- ప్రతివారం ఎక్కువ చెత్త సేకరించిన వారికి బహుమతులందించి ప్రోత్సహిస్తున్నారు.
- ఇతర కళాశాలల విద్యార్థులకు స్ఫూర్తిగా ఉండేలా తమతమ కార్యక్రమాల ఫొటోలను, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ఉంచుతున్నారు. పర్యావరణ అభివృద్ధికి పాటుపడాలనుకుంటున్న వారికి అవసరమైన సలహాలిస్తున్నారు.
- సెయింట్ జోసఫ్ విద్యార్థినులు నగరానికి చెందిన గ్రీన్‌వేవ్స్ ఎన్విరాన్‌మెంటల్ సొల్యూషన్స్‌తో ఒప్పందం కుదుర్చుకుని వారు సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలన్నింటినీ శాస్త్రీయంగా నిర్మూలించేందుకు చర్యలు చేపట్టారు.



ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో తయారుచేసిన వస్తువులతో పర్యావరణ క్లబ్ విద్యార్థినులు



వ్యర్థాలతో తయారు చేసిన దుస్తులతో పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ...

ప్రతిరోజూ కళాశాల ఆవరణలో పదినిమిషాలసేపు తిరిగి.. వ్యర్థాలను సేకరించి చెత్త కుండీల్లో వేస్తున్నారు.

ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఉపయోగించి దుస్తులు కూడా తయారు చేసి వాటిని ధరించి ప్రదర్శనలు ఇస్తూ అవగాహన కలిగిస్తున్నారు.

### విద్యార్థినుల స్ఫూర్తి ప్రశంసనీయం.....

విద్యార్థినుల ప్రయత్నం ప్రశంసనీయం. మేం కూడా చొరవ తీసుకుని మూడు కళాశాలల్లో పర్యావరణ క్లబ్‌లు ఏర్పాటుచేశాం. ఈ సంఖ్యను దశలవారీగా విస్తరిస్తాం. ఆయా కళాశాలల్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణకు బిన్లు ఏర్పాటు చేసి అందులో పోగుపడ్డ వ్యర్థాలను సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్మూలిస్తున్నాం. మాకున్న అనుభవంతో పర్యావరణ క్లబ్‌లు ఏర్పాటుచేయడానికి ముందుకొస్తున్న సంస్థలకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

– అనిల్, ఎండీ, గ్రీన్‌వేవ్స్ ఎన్విరాన్‌మెంటల్ సొల్యూషన్స్

### విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ ఉండాలి

విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహను పెంపొందించుకోవాలి. అమెరికా కాన్సులేట్ అధికారులు 'స్టూడెంట్ ఎక్స్ఛేంజి కార్యక్రమం' కోసం నిర్వహించిన పోటీల్లో నేను ఎంపికయ్యా. ఇలా దేశవ్యాప్తంగా ఐదుగుర్ని మాత్రమే ఎంపిక చేశారు. 'స్టడీ ఆఫ్ యు.ఎస్. ఇన్‌స్టిట్యూట్స్ ఆన్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ ఇష్యూస్' అంశంపై మాకు అధ్యయన అవకాశం కల్పించారు. అమెరికాలోని 'యూనివర్సిటీ ఆఫ్ మోంటెన' విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అక్కడ వివిధ పర్యావరణ సంస్థలు కాలుష్య నివారణకు తీసుకున్న చర్యలపై అవగాహన కలిగింది. ఆ స్ఫూర్తితోనే కళాశాలలో 'వేస్ట్ మేనేజ్‌మెంట్ క్లబ్' ప్రారంభించా. ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరిస్తున్నాం. చాలామంది విద్యార్థులు మా క్లబ్‌లో చేరారు. 63 మంది విద్యార్థినులు ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

– రేణు, బి.ఎ., తృతీయ



ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్మూలించడానికి ప్రత్యేక వాహనంలో పంపుతున్న పర్యావరణ క్లబ్ విద్యార్థినులు

## E WASTE BIN INSTALLED BY GREEN WAVES RECYCLERS




## PLASTIC WASTE COLLECTION BY INDRAJA OF WMC

